
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
శుక్రవారం 14 నవంబరు 2025



ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు

జిల్లా	ప్రాంతం	ఉష్ణోగ్రత (డిగ్రీల్లో)
వికారాబాద్	మర్పల్లి	12.2
రంగారెడ్డి	మంగల్‌పల్లి	11.5
మేడ్చల్	ఘట్‌కేసర్	13.0





స్వాధీనం చేసుకున్న వస్తువులు

భారీగా ఎలక్ట్రానిక్ పరికరాల

పట్టివేత

ఎయిర్‌పోర్టులో వ్యక్తి అరెస్ట్

శంషాబాద్ రూరల్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మరోసారి పెద్ద మొత్తంలో ఎలక్ట్రానిక్ పరికరాలను పట్టుకున్నారు. అబ్బాస్ రుక్నుద్దీన్ అనే ప్రయాణికుడు దుబాయ్ నుంచి 6ఈ 1466 విమానంలో గురువారం తెల్లవారుజామున 3.50 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడు. విమానాశ్రయంలో ఎయిర్ విలేజ్‌వద్ద బ్యాగులు పట్టుకుని తడబడుతూ కనిపించాడు. గమనించిన సీఐఎస్ఎఫ్ సిబ్బంది అనుమానంతో అతని బ్యాగులను చెక్ ఇన్ చేయాలని సూచించారు. బ్యాగులను స్కానింగ్ చేయగా అందులో డ్రోన్లు, ఐ ఫోన్ మ్యాక్స్ ప్రొ 17ఫోన్లు, పరిఫ్యూమ్‌లు సామ్‌సంగ్ ఫోన్లు, తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు దాదాపు రూ. 57 లక్షల విలువైన వస్తువులను అక్రమంగా తీసుకొస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామని కస్టమ్స్ అధికారులు వెల్లడించారు. అలాగే బుధవారం కూడా రూ.1.4 కోట్ల విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులను పట్టుకున్నారు. డ్రగ్స్ నిషేధిత ఎలక్ట్రానిక్ వస్తువులను అక్రమ రవాణా జరగకుండా ఎన్ని జాగ్రతలు తీసుకున్నా మళ్లీ అక్రమ రవాణ అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసుని పట్టుబడ్డ ఎలక్ట్రానిక్ వస్తువులను సీజ్ చేశామని అధికారులు వెల్లడించారు.



యాసంగి సాగు వివరాలు (హెక్టార్లలో)

పంట	అంచనా
వరి	1,19,692
జొన్న	1,820
మొక్కజొన్న	24,449
శనగలు	1,249
వేరుశనగ	7,055
కుసుమ	1,650
పొద్దుతిరుగుడు	1,660
ఆముదం	130
ఇతర పంటలు	3,980
కూరగాయలు	15,080
మొత్తం	1,76,765

అందుబాటులో ఉన్న ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో)

యూరియా	19,549
డీఏపీ	3,796
ఎంఓపీ	1,851
కాంప్లెక్స్	13,097
ఎస్ఎస్‌పీ	1,637

వరి వైపే

మొగ్గు..!

సాగు లక్ష్యం 1.2లక్షల ఎకరాలు

- గత ఏడాది కంటే 10వేల ఎకరాలు అధికం
- మొక్కజొన్న, కూరగాయల సాగు సైతం పెంపు
- యాసంగి వ్యవసాయ ప్రణాళిక విడుదల

వ్యవసాయాధికారులు యాసంగి సాగు ప్రణాళికను సిద్ధం చేశారు. వానాకాలంలో మాదిరిగా ఈ సీజన్‌లోనూ వరి సాగుకు ప్రాధాన్యత ఉంటుందని అంచనా వేశారు. గతంలో నీటి కొరత కారణంగా యాసంగిలో వరి పంటను ఎక్కువగా సాగు చేయొద్దని అధికారులు రైతులకు అవగాహన కల్పించేవారు. కానీ ఈ ఏడాది సమృద్ధిగా వానలు కుర వడంతో నీటి లభ్యత పెరిగింది. దీంతో యాసంగిలో అధికారులు వరి సాగును ప్రోత్సహిస్తూ సాగు విస్తీర్ణ లక్ష్యం పెంచారు. అలాగే యాసంగి సీజన్‌లో వివిధ పంటల సాగునూ పెంచుతూ లక్ష్యం నిర్ణయించారు.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : ఈ యాసంగిలో వరి సాగును పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. యాసంగి సీజన్‌లో నీటి కొరత ఉండే అవకాశం ఉండడంతో వరి సాగు తగ్గించి దీనికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేయాలని గతంలో ప్రభుత్వాలు రైతులకు సూచించేవి. ఇందుకోసం విస్తృతంగా ప్రచారం నిర్వహించేవి. అయితే ఈ ఏడాది యాసంగిలో ప్రభుత్వం వరి సాగుకే అధిక ప్రాధాన్యతనిచ్చింది. దాదాపు 1.2లక్షల ఎకరాల్లో రైతులతో వరి సాగు చేయించాలని లక్ష్యంగా నిర్ణయించింది. ఇది గత ఏడాదితో పోలిస్తే దాదాపు 10వేల ఎకరాలు అదనం కావడం గమనార్హం. ఈ ఏడాది యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 1,76,765 ఎకరాల్లో రైతులతో వివిధ పంటలను సాగు చేయించేందుకు జిల్లా వ్యవసాయశాఖ ప్రణాళికను రూపొందించింది. గత ఏడాది యాసంగిలో 1,62,095 ఎకరాల్లో రైతులు

మిగతా 8వ పేజీలో...





మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే సహించం

అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

కందుకూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కందుకూరు చంద్రారెడ్డి జీపీవోలకు సూచించారు. ఎక్కడైనా ఆక్రమణలు జరిగితే వాటిని వెంటనే స్వాధీనం చేసుకోవాలన్నారు. గురువారం ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డితో కలిసి కందుకూరు మండల పరిషత్ కార్యాలయంలో జీపీవోలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో భూముల ధరలకు రెక్కలు రావడంతో కొందరు ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని, వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం నూతనంగా గ్రామ పరిపాలన అధికారులను నియమించిందని గుర్తుచేశారు. ఆర్డీవో మాట్లాడుతూ... జీపీవోలు రెవెన్యూ చట్టాలపై మరింత అవగాహన కలిగి ఉండాలన్నారు. సదస్సులో కందుకూరు తహసీల్దార్ కె.గోపాల్, ఆర్డీవో కార్యాలయం డీటీ రాజు, కందుకూరు ఉప తహసీల్దార్ శేఖర్, జీపీవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుభాష్ రెడ్డి

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి సుభాష్ రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించుకోకపోతే పుడమిపై జీవనం ప్రశ్నార్థకమవుతుందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఆర్.సుభాష్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయులు ప్రాథమిక దశ నుంచే విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి ది ఎర్త్ సెంటర్‌లో కౌన్సిలర్ ఫర్ గ్రీన్‌రెవల్యూషన్, రాష్ట్ర విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో వాతావరణ మార్పులు, పాఠశాలల బాధ్యత, యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమం గురువారం ముగిసింది. సుభాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగంలో పేర్కొన్న ఆర్టికల్ 48ఏ, 51ఏ స్ఫూర్తితో పర్యావరణ పరిరక్షణ చేపట్టాలని పిలుపు నిచ్చారు. సీజీఆర్ వ్యవస్థాపకులు కొర్పోలు లక్ష్మారెడ్డి, అధ్యక్షురాలు కొర్పోలు లీల, యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రామ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ యానాల వెంకట్‌రెడ్డి, పర్యావరణ వేత్తలు ఉపేందర్ రెడ్డి, సాయిభాస్కర్‌రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, రవీందర్ రావు, లెనిన్, రఫీయొద్దీన్, రజనీకాంత్, నగేశ్ పాల్గొన్నారు.



మీర్ఖాన్‌పేటలో స్థలాన్ని పరిశీలిస్తున్న శశాంక, చంద్రారెడ్డి

గ్లోబల్ సమ్మిట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

స్థలాన్ని పరిశీలించిన ఫ్యూచర్ సిటీ అథారిటీ ఎండీ శశాంక

కందుకూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కందుకూరు మండలంలో ఏర్పాటు చేయనున్న ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 8, 9వ తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్-2025 సదస్సుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఫ్యూచర్‌సిటీ అథారిటీ ఎండీ శశాంక తెలిపారు. గురువారం ఆయన అదనపు కలెక్టర్ చంద్రారెడ్డితో కలిసి మీర్ఖాన్‌పేట రెవెన్యూ పరిధిలోని 112 సర్వే నంబర్‌లో స్థలాన్ని పరిశీలించారు. సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో ప్రజాపాలన - విజయోత్సవాల పేరిట నిర్వహించనున్న ఈ సమ్మిట్‌కు మరింత పటిష్టంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఇక్కడికి జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు హాజరుకానున్నట్లు తెలిపారు. సదస్సులకు వచ్చే వారికి వసతుల కల్పనలో నిర్లక్ష్యం చేయరాదని అధికారులకు సూచించారు. ఆయన వెంట టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, వాటర్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి, ఐజీ రమేశ్, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, తహసీల్దార్ కె.గోపాల్, పోలీసు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హతలేని క్లినిక్‌లపై చర్యలు తీసుకోండి

ఇబ్రహీంపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి విద్యార్హతలు లేని వ్యక్తులు కొందరు జిల్లాలోని వివిద ప్రాంతాల్లో విచ్చలవిడిగా క్లీనిక్స్, హెల్త్ సెంటర్స్ ఏర్పాటు చేసి వైద్యం చేస్తున్నారని, ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డా.లలితాదేవిని టీఆర్‌పీఎస్, ఆర్ఎంపీ, పీఎంపీ వైద్య సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు డా.వెంకట్‌రెడ్డి కోరారు. గురువారం జిల్లా వైద్యాధికారిని వెంకట్‌రెడ్డి బృందం మర్యాదపూర్వకంగా కలిసి పరిస్థితిని వివరించారు. జిల్లాలోని శేరిలింగంపల్లి, కొండాపూర్, మణికొండ, హఫీజ్‌పేట్, నానక్‌రాంగూడ, గోపన్‌పల్లి, గచ్చిబౌలి, ఖాజాగూడ, మియాపూర్ తదితర ప్రాంతాల్లో అనుమతులు లేకుండా విచ్చలవిడిగా క్లినిక్స్ ఏర్పాటు చేశారని తెలిపారు. రక్త పరీక్ష కేంద్రాలు పెట్టి ఇళ్లను విజిట్ చేస్తూ సెలెన్ ఎక్కించడంతోపాటు ఇంజక్షన్లు, డ్రెస్సింగ్ తదితర చికిత్సలు చేస్తున్నారని ఆమెకు వివరించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఇలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాల్సిందిగా వారు కోరారు.

పడకేసిన పాలన..

తప్పని వేదన!

రెండేళ్లుగా పాలకవర్గం లేని పంచాయతీలు

- నిధులు విడుదల చేయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- గ్రామాల్లో నిలిచిన అభివృద్ధి పనులు
- పైసల్లేక ఇబ్బందుల్లో కార్యదర్శులు
- వసతుల లేమితో ప్రజల అవస్థలు



జనం గోడు పట్టని ప్రభుత్వం



పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇవ్వనందున ఇబ్బందుల పాలవుతున్నాం. నల్లా పైప్‌లైన్ పాడైనా బాగు చేయలేకపోతున్నారు. ట్రాక్టర్‌కు డీజిల్ లేకపోవడంతో చెత్తను డంపింగ్ యార్డుకు తరలించడానికి పంచాయతీ కార్యదర్శులు ఇబ్బంది పడుతున్నారు. వీధి దీపాలు కాలిపోతే ఎవరిని అడగాలో తెలియడం లేదు. పంచాయతీఇంత దారుణం గతంలో ఏనాడు లేదు.

తాండ్ర రవీందర్, మొండిగౌరెల్లి

యాచారం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా పాలకవర్గం లేకపోవడంతో గ్రామ పంచాయతీల పాలన గాడి తప్పింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి చిల్లిగవ్వ అందకపోవడంతో అభివృద్ధి కుంటుపడింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచి స్టేట్ ఫైనాన్స్ నిధులు నిలిచిపోయాయి. కాంగ్రెస్ పాలనలో కూడా అదేరీతిగా నిధులు ఆగిపోయాయి. పంచాయతీలు ఏడాదికోసారి వసూలు చేసే ఇంటిపన్ను, వృత్తిపన్ను తదితర వాటితో వచ్చే కొద్దిపాటి ఆదాయంతో ట్రాక్టర్ల డీజిల్, దాని మరమ్మతులకు కూడా సరిపోవడం లేదని తెలుస్తుంది. ఇక చిన్న పంచాయతీల పరిస్థితి మరింత దారుణంగా మారింది. జిల్లాలో 21 మండలాలు, 526 పంచాయతీలున్నాయి.

సమస్యలతో సతమతం

జిల్లాలోని గ్రామ పంచాయతీల భారమంతా కార్యదర్శులపై పడింది. నిధులు లేకపోవడంతో వాటి నిర్వహణ ఇబ్బందిగా మారింది. అప్పులు తెచ్చి పనులు చేపడుతున్నారు. ట్రాక్టర్ల డీజిల్‌కు, దాని మైనర్ మరమ్మతులు, పైప్‌లైన్ పాడైతే, విద్యుద్దీపాలు కాలిపోతే కొందరు పంచాయతీ కార్యదర్శులు తమ సొంత డబ్బును ఖర్చు చేస్తున్నారు. పంచాయతీలకు

మిగతా 8వ పేజీలో...

రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో పెరిగిన సాగు విస్తీర్ణం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో సాగు విస్తీర్ణం పెరిగి ఆహార ధాన్యాల ఉత్పత్తిలో తెలంగాణ దేశంలో అగ్రభాగాన నిలుస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని విదంగా తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగం అభివృద్ధికి పెద్ద పీట వేస్తుందన్నారు. ఆమనగల్లు మండలం పోలెపల్లి గేటు వద్దగల అభిషేక్ కాటన్ మిల్ లో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. విక్రయానికి తెచ్చిన పత్తిని పరిశీలించి రైతులతో మాట్లాడారు. వర్షాలకు పత్తి నల్లబడిందని, చలికి తేమ శాతం రానందున కొంత సడలింపు ఇవ్వాలని ఎమ్మెల్యేను రైతులు కోరారు. తడిసిన పత్తిని కూడ కొనుగోలు చేసి మద్దతు ధర ఇవ్వాలన్నారు. రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని కసిరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ్మా, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, సీపీవో రాజీవ్, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి,

మిగతా 8వ పేజీలో...



సమస్యలను తెలుసుకుంటున్న చక్రపాణి

విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరిస్తాం

టీజీఎస్‌పీడీసీఎల్ కమర్షియల్ డైరెక్టర్ చిలకమర్రి చక్రపాణి

మహేశ్వరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేసేందుకు తమ సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని టీజీ ఎస్‌పీడీసీఎల్ కమర్షియల్ డైరెక్టర్ చిలకమర్రి చక్రపాణి అన్నారు. ప్రజాబాటలో భాగంగా గురువారం తుక్కుగూడలో విద్యుత్ వినియోగదారుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, నూతన లైన్లు తదితర పనులకు శ్రీకారం చుట్టామన్నారు. వినియోగదారులకు సమస్యలేమున్నా సంబంధిత అధికారులకు స్వయంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు పాండ్య, శ్రీరామ్‌మోహన్, గోపాలకృష్ణ, శంకర్, చక్రపాణి పాల్గొన్నారు.

హక్కుల సాధనకు సంఘటితం కావాలి

మత్స్యకార సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహా




పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గోరెంకల నర్సింహ

తలకొండపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి మత్స్యకారులు సంఘటితంగా ముందుకు సాగాలని మత్స్యకార సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ అన్నారు. మత్స్యకారులకు అన్ని రంగాలలో సమ ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కడ్తాల మండలం మక్తమాదారం గ్రామంలో గురువారం ఈనెల 18న జరిగే మత్స్యకార వృత్తి సంరక్షణ, మత్స్యకారుల సంక్షేమ సంఘం జిల్లా మహాసభ విజయవంతం గురించి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభలకు సంబంధించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సభలకు ముదిరాజ్ కో-ఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, అఖిల భారత మత్స్యకార, మత్స్యకార్మిక సంఘం జాతీయ కార్యదర్శి లెల్లెల్ల బాలకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరవుతారని ఆయన తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 5 వేల కోట్లు కేటాయించాలన్నారు. ప్రతి మత్స్యకార సొసైటీకి రూ. 10లక్షలు ఇవ్వాలన్నారు. మత్స్యమిత్ర మహిళా సంఘాలను పునరుద్ధరించి ప్రతి సంఘానికి రూ.10 లక్షలు అందజేయాలన్నారు. ప్రతీ గ్రామంలో మత్స్యకార భవనాలు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మత్స్యకార సొసైటీ అధ్యక్షులు వెంకటేశ్, బోళ్ల యాదగిరి, లింగమయ్య, అంజయ్య, నర్సింహ్మా, శ్రీకాంత్, శివనాథ్, రాములు, వెంకటయ్య, జంగయ్య, నూకం శేఖర్ పాల్గొన్నారు.



సిమెంట్ కర్మాగారం రోప్‌వే పిల్లర్లను పరిశీలించిన సర్వేయర్


తాండూరు రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెల్కటూర్ శివారులో గల అదానీ సిమెంట్ కర్మాగారం రోప్‌వే పిల్లర్లను సర్వేయర్ మహేశ్ గురువారం పరిశీలించారు. కర్మగారం వెనుక గతంలో నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలేసిన పిల్లర్లను సర్వేయర్ కంపెనీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఆ పిల్లర్ల గుంత బాస్పల్లి రెవెన్యూలో నిర్మించారనే అంశంపై పరిశీలించామని చెప్పారు. కర్మాగారం సిమెంట్ ఉత్పత్తులను పెంచేందుకే రోప్‌వేను నిర్మించనున్నట్లు సమాచారం. అందుకే పిల్లర్లను మరోసారి సర్వేయర్‌తో పరిశీలించినట్లు తెలుస్తోంది.



నవాంద్గీలో ఎంపీ నిధులతో బోరు



బషీరాబాద్,నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎంపీ నిధులతో నవాంద్గీలో గురువారం బోరు వేశారు. నీటి సమస్యపై స్థానికులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా, నిధులు మంజూరు చేసినట్లు నాయకులు పేర్కొన్నారు. బీజేపీ నాయకులు దగ్గరుండి డ్రిల్లింగ్ చేయించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజ్‌కుమార్ కులకర్ణి, మండలాధ్యక్షుడు జగన్, గిరిజాపూరం రాఘవేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



పరిహారం పెంచి ఆదుకుంటాం



ఎమ్మెల్యే రంగారెడ్డిని కలిసిన మొండిగౌరెల్లి రైతులు

యాచారం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులకు తగినంత భూపరిహారం పెంచి ఆదుకుంటామని, ఎకరానికి రూ.26లక్షలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. అసైన్డ్ భూములను ప్రభుత్వం ప్రజా అవసరాలకు తీసుకుంటుందని ఆయన అన్నారు. గురువారం మొండిగౌరెల్లి రైతులు ఎమ్మెల్యేను హైదరాబాద్‌లో కలిసి తమకు ఎకరానికి రూ.60లక్షలు ఇచ్చేలా చూడాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తెస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఆక్రోశ సభను విజయవంతం చేయాలి



వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

కొందుర్గు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బీసీ ఆక్రోశ సభను విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర నాయకులు బిక్షపతి కోరారు. గురువారం కొందుర్గులో బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఆక్రోశ సభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరు బీసీ పోరాటంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో లాలయ్య, మల్లేష్, రవీందర్, గిరి, రఘు, నవీన్, కృష్ణయ్య, నర్సిములు పాల్గొన్నారు.

ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలి

బషీరాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్న తహసీల్దార్, ఆర్ఐపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల సురేశ్ గురువారం సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నవాంద్గీ కాగ్నా వాగులో ఇసుక తవ్వుతున్నా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

నేడు నాగిళ్లలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

మాడ్గుల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నాగిళ్ల రైతు వేదిక వద్ద శుక్రవారం వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని ఐకేపీ ఏపీఎం శోభ గురువారం తెలిపారు. ముఖ్య అతిథిగా ఆమనగల్లు ఏఎంసీ ఛైర్‌పర్సన్ గీత హాజరవుతాని తెలిపారు. ఎ-గ్రేడ్ వడ్లు క్వింటాలుకు రూ.2,389, సాధారణ గ్రేడ్‌కు రూ2,369, సన్న వడ్లకు అదనంగా 500 బోనస్ ఇస్తామని వివరించారు. వడ్లలో తేమ 17శాతానికి మించొద్దని తెలిపారు.




















పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు వెళ్లనున్న జిల్లా కళాకారులు

టీటీడీ బ్రహ్మోత్సవాలకు జిల్లా కళాకారులు

తాండూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి జరగనున్న పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు తెలంగాణ తరుఫున వికారాబాద్ జిల్లా కళాకారులు పాల్గొనున్నారు. తాండూర్ ఫైన్ ఆర్ట్స్ కల్చరర్ అకాడమి డ్యాన్స్ మాస్టర్ ఆధ్వర్యంలో 60 మంది బృందం గుస్సాడి, కోయ, బతుకమ్మ, కోలాట ప్రదర్శన ఇవ్వనున్నారు. కార్యక్రమంలో జానపద కళాకారుడు అశోక్ పాల్గొనున్నాడు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

తాండూరు రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరన్‌కోట్ జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని గురువారం సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ పరిశీలించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహారాన్ని తనిఖీ చేశారు. హెచ్‌ఎం హేమలతను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో 355 మంది విద్యార్థులకు 289 మంది హాజరయ్యారని తెలిపారు. పాఠశాల గదిలో ఉన్న బియ్యాన్ని పరిశీలించారు. బియ్యంలో కొంత పురుగులు, బెడ్డలు ఉండటంతో హెచ్‌ఎంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అన్నం వండే ముందే బియ్యాన్ని శుభ్రం చేయాలని చెప్పారు. బియ్యం నాణ్యత లేకుంటే సివిల్‌సప్లయీస్ అధికారులకు రిటర్న్ చేయాలని ఆదేశించారు. మరోసారి ఇలాంటి పొరపాట్లు జరిగితే చర్యలు తప్పవని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ తారాసింగ్, ఎంపీడీవో విశ్వప్రసాద్, ఎంఈవో వెంకటయ్య ఉన్నారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం, బోధనా విధానంపై ఎంఈవో పరిశీలించారు. నాణ్యమైన విద్యను అందించాలని హెచ్‌ఎం బారీ, టీచర్లు దస్తప్ప, శివకుమార్‌లకు సూచించారు.



కరన్‌కోట్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్



రిటైర్డ్ ఇంజనీర్ అరుణ్‌కుమార్ భౌతిక కాయానికి నివాళులు అర్పిస్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్

రిటైర్డ్ ఇంజనీర్ మృతదేహానికి స్పీకర్ నివాళి

వికారాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌కు చెందిన రిటైర్డ్ ఇంజనీర్ అరుణ్‌కుమార్ గురువారం మరణించారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌లు ఆయన ఇంటికి వెళ్లి అరుణ్‌కుమార్ భౌతికకాయానికి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను నేతలు పరామర్శించారు.



రూ.20లక్షల చెక్కును అందజేస్తున్న ఆర్‌ఎం ఎల్.శీల, బ్యాంకు సిబ్బంది

బీమా పథకాల్లో భాగస్వాములు కావాలి

కేశంపేట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బ్యాంకులు అందించే బీమా పథకాల్లో ఖాతాదారులు భాగస్వాములు కావాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ ఎల్.శీల అన్నారు. కొత్తపేటలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. సామాజిక భద్రతలో భాగంగా ఖాతాదారులకు బ్యాంకులు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా, అటల్ పెన్షన్ యోజన పథకాలు అందిస్తోందని తెలిపారు. ఖాతాదారులు ఆయా పథకాల్లో రిజిష్టర్ కావాలని సూచించారు. ఓటీపీలు, బ్యాంకు ఖాతాల వివరాలు ఎవ్వరికీ చెప్పొద్దని సూచించారు. ఫోన్‌లో బ్యాంకు సిబ్బంది ఓటీపీలు అడగరని గుర్తుచేశారు. సైబర్ మోసాలతో డబ్బు పోతే వెంటనే 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. కొత్తపేట బ్రాంచ్‌లో గన్నె సురేష్ ఖాతాదారుడు రూ.వెయ్యితో బీమా తీసుకున్నాడని, అతడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా రూ.20లక్షల బీమా రాగా నామినీ మల్లయ్యకు చెక్కును ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సోమ్‌నాథ్, ఫీల్డ్ ఆఫీసర్ వీరకుమార్, బిజినెస్ మేనేజర్ కిషోర్, ఎఫ్ఐసీ మహేశ్వర్‌రెడ్డి, ఫాలి, సుబ్బారెడ్డి, సురేష్‌రెడ్డి, ఎస్‌బీఐ బీడీ ఎంలు గోపి, అలీ పాల్గొన్నారు.

సన్నిధాన పనులను పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కేసీ తండాలో నిర్మిస్తున్న అయ్యప్ప సన్నిధాన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని తండా బీఆర్‌ఎస్ నాయకులను మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆదేశించారు. గురువారం మహేశ్వరంలో ఓ కల్యాణ మండపాన్ని ప్రారంభించిన అనంతరం కేసీ తండాలో అయ్యప్ప స్వాముల సన్నిధాన పనులను బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా పనులను పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మోతీలాల్, వెంకటేశ్వర్‌రెడ్డి, పాండుయాదవ్, ప్రభాకర్, ఆదిల్‌అలీ పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించిన హైడ్రా

- రైతు మలిపెద్ది కౌశిక్‌రెడ్డి ఆరోపణ



ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఉత్తర్వులను హైడ్రా అధికారులు ఉల్లంగించి తమ భూమి ప్రహరీగోడ కూల్చి, పంట పొలాన్ని ధ్వంసం చేశారని ప్రతాప్‌సింగారానికి చెందిన రైతు మలిపెద్ది కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతాప్‌సింగారంలోని సర్వే నంబర్లు 315, 316 పార్టుల్లోని 6ఎకరాల 14గుంటల భూమి తమ తండ్రి మలిపెద్ది మధుసూన్‌రెడ్డి పేరిట ఉందన్నారు. భూమికి ప్రహరీ నిర్మించి పండ్ల తోట, కూరగాయలు పండిస్తున్నామని తెలిపారు. అయితే సర్వే నంబర్ 317లో ప్లాట్లు కొన్నట్టు కొందరు హైడ్రాను తప్పుదోవ పట్టించి తమ పట్టా భూమిలోనే ప్లాట్లు ఉన్నాయని ప్రహరీ కూల్చేయించారని వాపోయారు. తమ భూమిలో ఎలాంటి కూల్చివేతలు చేయొద్దని హైకోర్టు నుంచి స్టేటస్‌కో తెచ్చుకున్నా హైడ్రా ప్రహరీని కూల్చి పంటలను ధ్వంసం చేసిందన్నారు. తమ భూమిలో ఎలాంటి లేఅవుట్ లేదని గతంలోనే పంచాయతీ, ప్రస్తుత పోచారం మునిసిపల్ అధికారులు సైతం ఎన్వోసీ ఇచ్చారని తెలిపారు. కూల్చివేతల అనంతరం గ్రామానికి చెందిన చంద్రశేఖర్, నాగిరెడ్డి, ఇ.మల్లేష్ తమ పంట భూమిలోని డ్రిప్ సిస్టాన్ని ధ్వంసం చేశారని, వీరిపై మేడిపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

నేడు 'మీ డబ్బు.. మీ హక్కు' అంశంపై శిబిరం

ఇబ్రహీంపట్నం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): 'మీ డబ్బు.. మీ హక్కు' అనే ఇతివృత్తంతో క్లెయిమ్ చేసుకోని ఆస్తుల సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాలకనుగుణంగా శుక్రవారం కలెక్టరేట్‌లో శిబిరం నిర్వహిస్తున్నట్లు డీపీఆర్వో వెంకటేశం గురువారం తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని దశలవారీగా జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కూల్చిన బస్టాప్ పునర్నిర్మాణం

ఘట్‌కేసర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూల్చిన బస్టాప్‌ను మున్సిపల్ అధికారులు తిరిగి వారితోనే నిర్మింపజేస్తున్నారు. 'రెచ్చిపోయిన రియల్ వ్యాపారులు' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు స్పందించి మున్సిపల్ కమిషనర్ రాజేష్ విచారణ జరిపి చర్యలు చేపట్టారు. ఎన్ఎఫ్‌సీనగర్‌లో బస్టాప్‌ను కూల్చిన రియల్ ఎస్టేట్ వ్యాపారి తన తప్పును ఒప్పుకొని కూల్చిన చోటే బస్టాప్‌ను తిరిగి నిర్మిస్తున్నాడు. రోడ్డు జాగాలో ఉన్న బస్టాప్‌ను కూల్చివేతపై పోలీసులకు ఫిర్యాదు చేశామని కమిషనర్ తెలిపారు. కాగా ప్రయాణికుల కోసం ఎప్పుడో నిర్మించిన బస్టాండ్‌ను గతంలో ఉన్నట్టుగా నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఎన్ఎఫ్‌సీనగర్‌లో బస్టాప్‌ను తిరిగి నిర్మిస్తున్న ప్లాట్ యజమాని

ఆకలి తీర్చుతున్న అల్పాహారం

- సీఎం నియోజకవర్గంలో 306 పాఠశాలల్లో అమలు
- పెరిగిన విద్యార్థుల హాజరు శాతం
- వయాట్రిస్, హరే రామ హరే కృష్ణ ట్రస్ట్‌ల సహకారంతో నిర్వహణ
- సీఎం చొరవతో త్వరలోనే ట్రస్ట్ ద్వారా మధ్యాహ్న భోజనం



అల్పాహారం తింటున్న విద్యార్థినులు



కొడంగల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం ఎంతో మేలు చేస్తోంది. అల్పాహార పథకంతో పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లో హరే రామ, హరే కృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించిన ఈ పథకం సత్ఫలితాలిస్తోంది. చాలా మంది పేద విద్యార్థులు ఉదయం ఏమీ తినకుండానే పాఠశాలకు హాజవుతారు. మధ్యాహ్న భోజనం వరకూ ఆకలితో చదువుపై దృష్టి సారించలేకపోతారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో కొడంగల్ పరిధి పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని అమలు చేస్తున్నారు. వయాట్రిస్ సంస్థ, హరే రామ హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా అల్పాహారాన్ని అందిస్తున్నారు. 8 మండలాల్లోని 306 ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పెడుతున్నారు. అయితే ఈ సంస్థ ఆధ్వర్యంలో త్వరలోనే మధ్యాహ్న భోజనాన్ని సైతం అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో శ్రీకారం చుడుతున్నారు. కాగా ఇప్పటి వరకు భోజన కార్మికులు పాఠశాలల ప్రాంగణాల్లో వండి విద్యార్థులకు వడ్డిస్తున్నారు. త్వరలో మధ్యాహ్న భోజనాన్ని సైతం సెంట్రల్ కిచెన్‌లో వండి స్కూళ్లకు సరఫరా చేస్తారు. హైజీనిక్ ఫుడ్ పంపిణీ లక్ష్యంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని తటపెట్టారు. కాగా అల్పాహార పథకంతో విద్యార్థుల హాజరు శాతం పెరిగింది. కొడంగల్ బాలికల పాఠశాలలో 670 మంది విద్యార్థినులు ఉన్నారు. అల్పాహార పథకానికి ముందు ప్రార్థన సమయానికి 250 మంది వరకు యాబ్సెంట్ అయ్యేవారు. అల్పాహారంతో ఇప్పుడు పాఠశాల సమయానికి 500 మంది బాలికలు వస్తున్నారని తెలిపారు.



వాహనాలతో అల్పాహారం చేరవేత

కొడంగల్ నియోజకవర్గంలోని 8 మండలాల్లోని 306 ప్రభుత్వ పాఠశాలలకు 19 వాహనాలతో అల్పాహారాన్ని సరఫరా చేస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డులోని అల్పాహార కేంద్రంలో 60 మందికిపైగా సిబ్బందితో వండుతున్నారు. కొడంగల్, బొంరాస్‌పేట్ దౌల్తాబాద్, దుద్యాల్, కొత్తపల్లి, మద్దూర్, కోస్గి మండలాల్లోని పాఠశాలల 26,157 మంది విద్యార్థులకు టిఫిన్లు అందిస్తున్నారు. అల్పాహారంలో ఆరు రోజులకు ఆరు రకాల టిఫిన్లు అందజేస్తున్నారు. దోశ, ఇడ్లీ సాంబారు, రాగి ఇడ్లీ, మైసూర్ బోండా, చట్నీ ఉప్మా సాంబారు, పూరి ఆలూ కుర్మా, పొంగలి వడ్డిస్తున్నారు.

పథకం సత్ఫలితాలిస్తోంది



సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో ప్రభుత్వ బడుల్లో నిర్వహిస్తున్న అల్పాహార పథకం మంచి ఫలితాలు ఇస్తోంది. వయాట్రిస్, హరే రామ హరే కృష్ణ సంస్థల సహకారంతో 6 డిసెంబరు, 2024 నుంచి అల్పాహార పథకం అమలవుతోంది. బ్రేక్‌ఫాస్ట్ పథకానికి ముందు ప్రభుత్వ స్కూళ్లలో 23,200 మంది విద్యార్థులు ఉంటే పథకం అమలు తరువాత వారి సంఖ్య 26,157 మందికి చేరింది.

- కృష్ణ చైతన్య, డీఎం, హరే రామ హరే కృష్ణ ట్రస్ట్

దొంగ నోట్ల ముఠాకు తాండూరుతో లింకులు

హైదరాబాద్‌లో పట్టుబడిన ముఠా

- గతంలో తాండూరు కేంద్రంగా నకిలీ కరెన్సీ తయారీ
- పట్టణంలో భారీ నకిలీ నోట్ల చలామణి



నిందితుడు కస్తూరి రమేశ్‌బాబు

తాండూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తాండూరు కేంద్రంగా కొంత కాలం రూ.500 ఫేక్ కరెన్సీ తయారీ చేసి ఇక్కడి నుంచి దందాను హైదరాబాద్‌కు మార్చిన తర్వాత అక్కడి టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడ్డారు. తాండూరులోనూ నకిలీ నోట్లు చలామణి చేయడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రూ.500 నకిలీ నోట్లు భారీగా చేతులు మారినట్టు తెలుస్తోంది. ఈ ముఠాను పట్టుకోవడంలో తాండూరు పోలీసులు విఫలమయ్యారు. కోస్గి మండలం గుండుమల్‌కు చెందిన కస్తూరి రమేశ్‌బాబు తన సోదరి రామేశ్వరి తాండూరు పరిధి కోకట్‌లో ఓ ఇంట్లో నివాసం ఉంది. అక్కడ రమేశ్‌బాబు నకిలీ నోట్లు తయారు చేశాడు. వాటి చలామణికి ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టారు. కొందరు నకిలీ నోట్ల చలామణి ముఠాలో చేరారు. ఒక్క ఒరిజనల్ రూ.500కు నాలుగు నకిలీ రూ.500 నోట్లు ఇచ్చి మార్పిడి చేయించారు. తర్వాత రమేష్‌బాబు హైదరాబాద్‌లోని మెహదీపట్నానికి మకాం మారాడు. దొంగ వ్యవహారం బట్టబయలు కావడంతో పోలీసులకు పట్టుబడ్డారు. రమేశ్‌బాబు, రాజేశ్వరిలపై గతంలోనే నకిలీ నోట్ల కేసులు నమోదయ్యాయి. తాండూరు కేంద్రంగా నకిలీ నోట్ల వ్యవహారం నడిపిన వీరితో ఇక్కడి పలువురుతో సంబంధాలున్నాయి. పోలీసులు లోతుగా విచారణ జరపాల్సి ఉంది.

తాండూరు డీఎస్పీ డీజీపీ కార్యాలయానికి అటాచ్

కొత్త డీఎస్పీగా నర్సింగ్‌యాదయ్య

- పోలీసుల పని తీరుపై ఉన్నతాధికారుల అసంతృప్తి
- డీఎస్పీపై వేటు గురించి ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'
- ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్ఐల బదిలీకి అవకాశం



తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డిని డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ డీజీపీ శశిధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో డీఎస్పీగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ డీఎస్పీ నర్సింగ్‌యాదయ్యను నియమిస్తున్నారు. డీఎస్పీ బాలకృష్ణారెడ్డిపై వచ్చిన పలు ఆరోపణలు, విమర్శల నేపథ్యంలో వేటు తప్పదని పోలీసు శాఖలో చర్చ జరిగింది. కేసుల విచారణ విషయంలో ఉన్నతాధికారులు ఆయన విధి నిర్వహణ తీరుతో అసంతృప్తిగా ఉన్నారని, తాండూరు పోలీసుల పని తీరు సరిగా లేదని, బదిలీలకు రంగం సిద్ధమైందని ఆంధ్రజ్యోతిలో అక్టోబరు 11న కథనం ప్రచురితమైంది. చోరీ కేసుల ఛేదనలో పోలీసుల వైఫల్యం, సివిల్ తగాదాల్లో తలదూర్చడం, సెటిల్‌మెంట్లకు ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపణలొచ్చాయి. అక్రమార్కులకు డీఎస్పీ కార్యాలయం ప్రాధాన్యం ఇచ్చి గంటల తరబడి వారితో చర్చలు జరిపిందని, సరైన న్యాయం జరగడం లేదని బాధితులు ఆరోపించారు. ఓ జిప్సం ఫ్యాక్టరీ లావాదేవీల వ్యవహారం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో డీఎస్పీ ఏకపక్షంగా వ్యవహరించారని ఆరోపిస్తూ ప్రజాసంఘాలు ధర్నాలు చేశాయి. ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ నాయకులు సైతం డీఎస్పీ పనితీరు పట్ల అసంతృప్తిగా ఉన్నట్టు వార్తలొచ్చాయి. ఈ నేపథ్యంలోనే డీఎస్పీని ట్రాన్స్‌ఫర్ చేసినట్టు చర్చించుకుంటున్నారు. కాగా తాండూరులో ఇద్దరు సీఐల బదిలీ కూడా జరగొచ్చనే వార్తలొస్తున్నాయి. అలాగే పెద్దేముల్, బషీరాబాద్ ఎస్ఐలను ట్రాన్స్‌ఫర్ చేస్తారనే చర్చా సాగుతోంది. ఇదిలా ఉంటే కరన్‌కోట్ ఎస్ఐ బదిలీ కాకుండా ఓ కాంగ్రెస్ నాయకుడు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వద్ద గట్టి ప్రయత్నమే చేయగా బదిలీకి బ్రేక్ పడినట్లు సమాచారం.



శిక్షకులతో ప్రభాకర్

కలరిపయట్టు శిక్షకులను కలిసిన సినీ నటుడు ప్రభాకర్

దుద్యాల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని హస్నాబాద్‌లో మూడు రోజులుగా కలరిపయట్టు శిక్షణ కొనసాగుతోంది. పంచాయతీ ఆవరణలో గురువారం శిక్షణ కొనసాగుతుండగా ఇటీవల గ్రామానికి వచ్చిన బాహుబలి సినీ నటుడు ప్రభాకర్ శిక్షకులతో కాసేపు ముచ్చటించారు. కేరళలో ప్రత్యేకంగా నేర్పించే ఈ విద్య గురించి ప్రధాన శిక్షకుడు రమేశ్ వివరించారు. ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రత్యేకత కలిగిన ఈ విద్యను బాల్యం నుంచే నేర్చుకోవడం ఉత్తమం అన్నారు. కార్యక్రమంలో శిక్షకులు రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



మొండిగౌరెల్లిలో వరి పంటను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

మేలు రకం విత్తనాలతో అధిక దిగుబడి

యాచారం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మేలు రకం వరి విత్తనాలు వాడి అధిక దగుబడులు సాధించాలని, కేఎన్‌ఎం1638 రకం వరి విత్తనాలు నాణ్యమైనవని వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త వాణిశ్రీ తెలిపారు. రైతన్నకు నేస్తం అనే కార్యక్రమం చేపట్టి అధిక దిగుబడి సాధనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై క్షేత్రస్థాయిల్లో గురువారం రైతులకు వివరించారు. వరి పొట్ట దశలో యూరియా చల్లితే తాలు వస్తుందని చెప్పారు. సేంద్రియ ఎరువులు వాడితే లాభాలు వస్తాయన్నారు. తమ పొలంలోనే నాణ్యమైన విత్తనాలు తయారు చేసుకోవడంపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో రవినాథ్ తదితరులు ఉన్నారు.

అంగడి చిట్టెంపల్లిని సందర్శించిన శాస్త్రవేత్తలు

పూడూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధి అంగడిచిట్టెంపల్లిలో గురువారం వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు పర్యటించారు. శాస్త్రవేత్తలు అరుణశ్రీ, పద్మజ, మల్లయ్య, ఏవో తులసిరాంతో కలిసి పంటల సాగుపై రైతులకు సూచలను, రైతు ఉత్పాదక సంఘాల ఆవశ్యకతపై వివరించారు. కార్యక్రమంలో ఏఈవో ఎలియాస్, మాజీ సర్పంచ్ షకీల్, మాజీ ఎంపీటీసీ విఠలయ్య, రైతులు పాల్గొన్నారు.



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

విధుల పట్ల నిర్లక్ష్యం

తాండూరు పీఆర్ ఈఈని ప్రభుత్వానికి సరెండర్ చేసిన కలెక్టర్

ఇన్‌చార్జిగా వికారాబాద్ ఈఈకి బాధ్యతల అప్పగింత

తాండూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తాండూరు డివిజన్ పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యనారాయణరెడ్డిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అత్యవసర ప్రభుత్వ పనులను పూర్తిచేయకపోవడం, అందుకు సరియైన వివరణ ఇవ్వకపోవడంతో ఈఈ సత్యనారాయణరెడ్డిని ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ కొన్ని రోజుల క్రితం కలెక్టర్ ప్రతీక్‌జైన్ పీఆర్ చీఫ్ ఇంజనీర్‌కు లేఖ రాశారు. సదరు అధికారి విధుల పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని వహిస్తున్నాడని లేఖలో కలెక్టర్ పేర్కొన్నారు. తాండూరు పీఆర్‌కు ప్రత్యామ్నాయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను కేటాయించాలని కోరారు. దీంతో ప్రభుత్వం వికారాబాద్ డివిజన్ పీఆర్ ఈఈ ఉమేష్ కుమార్‌ను తాండూరు డివిజన్‌కు ఇన్‌చార్జిగా నియమించింది.

నడవలేని వారికి ఇంటి వద్దే పింఛన్ ఇవ్వాలి

ఇబ్రహీంపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పూర్తిగా నడవలేని దివ్యాంగులకు, వృద్ధులకు ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత అధికారులకు సూచించారు. గురువారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరిగూడలోని శ్రీఇందు ఇంజనీరింగ్ కళాశాలలో సంక్షేమ పింఛన్లపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పింఛన్‌దారుల్లో భర్త, లేదా భార్య మరణిస్తే దరఖాస్తులను పరిశీలించి దంపతుల్లో ఒకరికి వెంటనే పింఛన్ మంజూరు చేయాలన్నారు. పెన్షన్ల పంపిణీపై ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి సందర్శించి మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ వార్డు ఆఫీసర్లు ఎన్ఎఫ్‌బీఎస్ పథకంపై అవగాహన కల్పిస్తూ దరఖాస్తులను స్వీకరించి అధికారులకు పంపాలని తెలిపారు. కార్యక్రమంలో సెర్ప్ నుంచి పెన్షన్ డైరెక్టర్ గోపాల్‌రావు, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాటజీ డైరెక్టర్‌కు సత్కారం



కొమ్మూరి దివ్యశ్రీని అభినందిస్తున్న డైరెక్టర్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఘనాపూర్‌లోని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజనీరింగు కళాశాల స్ట్రాటజీ డైరెక్టర్ కొమ్మూరి దివ్యశ్రీకి 'ఇన్‌స్టిట్యూషనల్ ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ అండ్ సోషల్ రెస్పాన్సిబిలిటీ' అవార్డు దక్కింది. హైదరాబాద్‌లో బచ్పన్ బచావో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన దక్షిణ భారత సీఎస్ఆర్ సమ్మిట్-2025లో దివ్యశ్రీకి అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో దివ్యశ్రీని కాలేజీ యాజమాన్యంతో పాటు డైరెక్టర్ సుధీర్‌ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనాథ్ కశ్యప్, ఏవో నాగరాజు, అధ్యాపకులు సత్కరించారు. డైరెక్టర్ మాట్లాడుతూ.. తమ కళాశాలలో నాణ్యమైన విద్యతో పాటు సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్నందుకే అవార్డు లభించిందన్నారు.



చౌదరిగూడ : ఎల్వోసీలు అందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

పేదలకు వరం.. సీఎంఆర్ఎఫ్

షాద్‌నగర్ రూరల్/చౌదరిగూడ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పేదలకు ముఖ్యమంతి సహాయనిధి వరం లాంటిదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం హాజీపల్లి గ్రామానికి చెందిన కృష్ణవేణి వైద్యఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.3.10లక్షల ఎల్వోసీని గురువారం ఆయన అందించారు. ఆరోగ్యశ్రీలో లేని వ్యాధులకు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న పేదలకు ముఖ్యమంతి సహాయ నిధి ద్వారా ఆదుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో సుదర్శన్, నారాయణ తదితరులు ఉన్నారు. అలాగే క్యాంపు కార్యాలయంలో జిల్లేడ్ చౌదరిగూడ మండలానికి రూ.2.86లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ పత్రాలను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు, సత్యనారాయణరెడ్డి, శివ, చంద్రశేఖర్, ఆంజనేయులు, నర్సింహులు, నవీన్ మోహన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరాఫరాలో నేడు అంతరాయం

చౌదరిగూడ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వీరన్నపేట్, తుమ్మలపల్లి, చౌదరిగూడలో నేడు(శుక్రవారం) విద్యుత్ సరాఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ రవికుమార్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తుమ్మలపల్లి, వీరన్నపేట్, చౌదరిగూడలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కారణంగా విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు పనులు పూర్తయ్యేనా?

- లచ్చంపేట్-లాలాపేట్ మధ్య నిలిచిన బీటీ రోడ్ వర్క్
- రాకపోకలకు తప్పని ఇబ్బందులు

చౌదరిగూడ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రెండు గ్రామాలకు చెందిన ప్రజలు ఈ రహదారి వెంటనే రాకపోకలు సాగిస్తుంటారు. అయితే, ఇద్దరు రైతుల మధ్య వాగ్వాదంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు అర్ధంతరంగా మధ్యలోనే నిలిచిపోయాయి. జిల్లేడ్ చౌదరిగూడ మండలం లాల్‌పహాడ్ నుంచి లాలాపేట్ వరకు దాదాపుగా రోడ్డు పనులను పూర్తిచేశారు. కానీ, రోడ్డు నిర్మాణ పనులు లచ్చంపేట్, లాలాపేట్ గ్రామాల మధ్య అర్ధంతరంగా మధ్యలోనే నిలిచిపోయాయి.

మండల పరిధిలోని లచ్చంపేట్ గ్రామం నుంచి లాలాపేట్ మీదుగా షాబాద్ మండలం నుంచి హైదరాబాద్‌కు నిత్యం ప్రజల రాకపోకలు ఈ గ్రామం మీదుగానే సాగుతాయి. ఈమేరకు ప్రభుత్వం బీటీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడంతో లచ్చంపేట్ వాగు శివారు వరకు పనులు వెళ్లగానే.. ఇద్దరు రైతులు తమ వ్యవసాయ పొలంలో నుంచి రోడ్డు వేస్తున్నారని అభ్యంతరం చెప్పడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపి వేశాడు. అయితే, నిలిచిపోయిన పనులపై ఓ రైతు జిల్లేడ్ చౌదరిగూడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైనట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. లాలాపేట్, ఉమ్మెంత్యాల వాగులో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో వాగులోంచి ప్రయాణం నరక ప్రాయంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో వాగులో బైక్‌లపై నుంచి కిందపడి గాయాలపాలవుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందించి లచ్చంపేట్, లాలాపేట్ గ్రామాల మధ్యలో అర్ధంతరంగా నిలిచిన రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పనులు నిలిచిన లచ్చంపేట్-లాలాపేట్ రోడ్డు

నిర్మాణ పనులు చేపట్టాలి



రోడ్డు నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో పొలాలకు వెళ్లాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రాత్రివేళ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలి,

- బాల్‌రాజ్, లచ్చంపేట్, జిల్లేడ్-చౌదరిగూడ మండలం

పొలాలకు వెళ్లలేకపోతున్నాం



రోడ్డు నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోవడంతో పంటపొలాలకు వెళ్లాలంటే భయంగా ఉంది. పంట కోతలకోసం మెషీన్లు, మందు సంచులు తీసుకుపోవాలంటే ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలి

- శ్రీకాంత్‌రెడ్డి, లాలాపేట్, కొందుర్గు మండలం

పడకేసిన పాలన.. తప్పని వేదన!

(ఐదో పేజీ తరువాయి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోవడంతో పంచాయతీల్లో అభివృద్ధి పడకేసింది. జనం నుంచి పన్నుల రూపేణా వసూలు చేసిన డబ్బును పంచాయతీల అవసరాలకు నేరుగా వాడరాదని నిబంధన విధించడం వల్ల కష్టాలు రెట్టింపయ్యాయి. ఈ నిబంధనపై మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు మండిపడుతున్నారు. గ్రామ పంచాయతీలకు 2024 ఆగస్టు నుంచి కేంద్ర ప్రభుత్వ, 2023 (ఆగస్టు) నుంచి రాష్ట్ర ప్రభుత్వ నిధుల విడుదల ఆగిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా జనాభా కనుగుణంగా మనిషికి రూ.108 మేర నిధులను విడుదల చేయాల్సి ఉంది. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే స్టేట్‌ఫైనాన్స్ నిదులు నిలిపివేశారు. నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పంచాయతీలకు నిధులు ఇవ్వడం లేదు. వీటికి తోడు జనరల్‌ఫండ్ నిదులు వాడుకునే వీలు లేకుండా అధికారులు అడ్డగోలు నిబంధన విధించడంతో పంచాయతీల్లో సమస్యలు ఎక్కువయ్యాయి. పంచాయతీ కార్యదర్శులు జనం నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన డబ్బు ముందు ఎస్‌టీవోలో జమ చేస్తారు. 2024 ఆగస్టు నుంచి జనరల్‌ఫండ్ నిధులను వాడకుండా రాష్ట్ర ప్రభుత్వం ఫ్రీజ్ చేయడంతో కార్యదర్శులు తలలు బాదుకుంటున్నారు.

నిలిచిపోయిన ఫాగింగ్

పంచాయతీలలో నిధులు లేకపోవడంతో దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లేదు. డబ్బులు లేక రసాయనాలు కొనలేని పరిస్థితి నెలకొంది. ఇక బ్లీచింగ్ పౌడర్ కూడా కొనుగోలు చేయలేని దుస్థితిలో పంచాయతీలున్నాయి. చిన్నచిన్న అవసరాలకు పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేయాల్సి వస్తుంది. కాగా, కనీసం స్టేట్ ఫైనాన్స్ నిధులైనా విడుదల చేసి పంచాయతీల పాలనను గాడిలో పెట్టాలని జనం కోరుతున్నారు.

వరి వైపే మొగ్గు..!

(ఐదో పేజీ తరువాయి)

వివిధ పంటలు సాగు చేయగా ఈ ఏడాది అంతకు మించి పంటలను సాగు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గత ఏడాది యాసంగితో పోలిస్తే ఈ సారి అధికంగా 14,676 ఎకరాల్లో వివిధ పంటల సాగును పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో అత్యధికంగా వరి సాగు పెంచుతున్నారు. అలాగే గత ఏడాది కంటే ఈ సారి అధికంగా 1500 ఎకరాల్లో మొక్కజొన్న, 2వేల ఎకరాల్లో కూరగాయల సాగు పెంచాలని నిర్ణయించారు. ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురవడంతో భూగర్భజలాలు దండిగా ఉన్నాయి. దీంతో యాసంగిలో ఆయా పంటల సాగు గణనీయంగా పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది సాధారణం కంటే జిల్లాలో 49శాతం అధికంగా వర్షాలు కురిశాయి. జిల్లాలో సగటు 662 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, అంతకుమించి 986 మి.మీ వర్షం కురిసింది. దీంతో చెరువులు, కుంటలు నిండాయి. భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి. ఈ అనుకూల పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అధికారులు యాసంగి సీజన్‌లో వివిధ పంటల సాగు పెంచుతూ లక్ష్యం నిర్ణయించారు.

సన్నాలకు 'సై'

ఈ యాసంగి సీజన్‌లో అధికారులు నిర్ధారించిన దానికంటే కూడా వరి సాగు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం సన్నరకం బియ్యానికి రూ.500 ప్రోత్సాహకం ఇస్తుండడంతో రైతులు సన్నాలు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో వానాకాలం సీజన్‌లో కూడా వరి సాగు అంచనాలకు మించి రైతులు సాగు చేశారు. దీంతో ఈ ఏడాది రబీ వ్యవసాయ ప్రణాళికలో అధికారులు వరిసాగు లక్ష్యం గతం కంటే దాదాపు 10వేల ఎకరాలు పెంచారు. కానీ ఈసారి లక్ష్యానికి మించి వరి సాగు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది వర్షాలు సగటు కంటే అధికంగా కురవడంతో భూగర్భజలాలు భారీగా పెరిగాయి. దాదాపు అన్ని ప్రాంతాల్లో భూగర్భజలాలు అందుబాటులో ఉన్నాయి. దీంతో యాసంగిలో వరి సాగు గణనీయంగా పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

40వేల టన్నుల ఎరువులు

ఈ యాసంగి సీజన్‌లో జిల్లాకు దాదాపు 40వేల టన్నుల ఎరువులు అవసరమని అధికారులు అంచనా వేశారు. అత్యధికంగా యూరియా 19,549 టన్నుల అవసరం కాగా 13,097 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 3,796 టన్నుల డీఏపీ అవసరం ఉంది. ఈ మేరకు రైతులకు వివిధ ఎరువులు అందుబాటులో ఉంచుతున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉషా తెలిపారు. యాసంగిలో రైతులకు అవసరమైన అన్ని ఎరువులను సిద్ధం చేస్తున్నామని, ఎలాంటి కొరత ఉండదని చెప్పారు. ఇప్పటికే దాదాపు అన్ని చోట్ల ఎరువుల నిల్వలు అందుబాటులో ఉంచామని చెప్పారు.

అప్పు కింద పొలం రిజిస్ట్రేషన్ చేయమంటూ ఒత్తిడి

- పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న కండక్టర్
- చికిత్స పొందుతూ మృతి.. ఆలస్యంగా వెలుగులోకి..

క్రైం కార్నర్



యాదగిరి(ఫైల్)

ఇబ్రహీంపట్నం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అప్పు ఇచ్చిన వ్యక్తి తన పేరున పొలం రిజిస్ట్రేషన్ చేయమని ఒత్తడి చేయడంతో మనస్తాపానికి గురైన ఓ ఆర్టీసీ కండక్టర్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి నాగన్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై చందర్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగన్‌పల్లి గ్రామానికి చెందిన చెరుకూరి యాదగిరి(49) ఫరూఖ్‌నగర్ డిపోలో ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఏడాది క్రితం తన కూతురు వివాహానికని అదే గ్రామానికి చెందిన కట్ట సత్తయ్య వద్ద రూ.9.50 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆ సమయంలో ఎకరా పొలం సత్తయ్యకు తనఖా కింద రాసిచ్చాడు. కాగా, యాదగిరి అప్పు చెల్లించకపోవడంతో ఎకరా పొలం తన పేరున రిజిస్ట్రేషన్ చేయమంటూ సత్తయ్య అతని కుమారుడు సాయి గౌతమ్ యాదగిరిపై ఒత్తిడి తెచ్చారు. దాంతో మనస్తాపానికి గురైన యాదగిరి ఈనెల 9న(ఆదివారం) రాత్రి ఇంటి దగ్గరే ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంచుకొని తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు గాంధీ ఆసుపత్రిలో చేర్చారు. చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతుడు యాదగిరికి భార్య మంజుల ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సత్తయ్య అతని కుమారుడు సాయిగౌతమ్‌లపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

కొత్తూర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో పెంజర్ల రోడ్డులో గల పాలిమర్ పరిశ్రమలో గురువారం విద్యుదాఘాతానికి గురై కుసుకుమార్(22) అనే కార్మికుడు మృతిచెందినట్లు ఇన్‌స్పెక్టర్ నర్సయ్య తెలిపారు. బిహార్‌కు చెందిన కుసుకుమార్ ఏడాది క్రితం కొత్తూర్‌కు వలస వచ్చి పాలిమర్ పరిశ్రమలో కార్మికుడిగా చేరాడు. పరిశ్రమ లోపల యంత్రం వద్ద పనిచేస్తున్న కుసుకుమార్ ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. దాంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

విమానంలో స్మోకింగ్

- పైలెట్ ఫిర్యాదు.. ప్రయాణికుడిపై కేసు

శంషాబాద్ రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విమానంలో సిగరెట్ తాగిన ప్రయాణికుడిపై ఆర్జీఐఏ ఔట్‌పోస్టు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ కనకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. యునైటెడ్ ఎమిరేట్స్‌లోని రాస్ ఆల్ ఖైమా నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి వస్తున్న 6ఈ-1496 ఇండిగో విమానంలో మహ్మద్ మొహిద్ అనే ప్రయాణికుడు ఫ్లైట్ టేకాఫ్ తీసుకున్న తరువాత నిషేధిత సిగరెట్ కాల్చాడు. గమనించిన విమాన సిబ్బంది పైలెట్‌కు సమాచారం అందించారు. విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్‌కాగానే పైలెట్ ఆర్జీఐఏ ఔట్ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. విమానాల్లో సిగరెట్ కాల్చడం నిషేధం. కానీ, ఆ ప్రయాణికుడు.. విమాన సిబ్బంది, తోటి ప్రయాణికులు వాదించినా వినకుండా సిగరెట్ స్మోక్ చేశాడు. దాంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న యూరియా స్వాధీనం

- 298 బస్తాలు సీజ్ చేసిన ఎస్వోటీ

శంకర్‌పల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అక్రమంగా యూరియాను తరలిస్తున్న రెండు బొలెరో వాహనాలను రాజేంద్రనగర్ ఎస్వోటీ పోలీసులు గురువారం సాయంత్రం పట్టుకున్నారు. వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండలం మైతాబ్‌ఖాన్‌గూడ గ్రామంలో గల ఆగ్రో రైతు సేవా కేంద్రం నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా మహబూబాబాద్‌కు తరలిస్తుండగా.. శంకర్‌పల్లిలోని డబుల్ బెడ్‌రూంల వద్ద ఎస్వోటీ పోలీసులు పట్టుకున్నారు. రెండు బొలెరో వాహనాలలో గల 149 క్వింటాళ్ల(298 బస్తాలు) యూరియాను వారు స్వాధీనం చేసుకున్నారు. ఆగ్రో రైతు సేవా కేంద్రం నిర్వాహకుడు ముకుందరెడ్డితో పాటు బొలెరో వాహనాల డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

సీపీఐ 'ప్రచారజాత'ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ప్రభులింగం

శంకర్‌పల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీపీఐ ప్రచారజాత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం కోరారు. శంకర్‌పల్లిలో గురువారం సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార జాత ఈనెల 17న శంకర్‌పల్లికి వస్తుందని తెలిపారు. సీపీఐ వార్షికోత్సవాల సందర్భంగా ప్రచారజాతను నిర్వహిస్తున్నట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను ఆయన దుయ్యబట్టారు. శాంతి భద్రతలను కాపాడటంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఢిల్లీలో జరిగిన బాంబు పేలుడు ఘటనను ఆయన ఖండించారు. రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పద్మ, మండల కార్యదర్శి సుధీర్, జిల్లా నాయకులు జంగయ్య, గోపాల్‌రెడ్డి, మాణయ్య, అంతయ్య, రవి, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో పెరిగిన సాగు విస్తీర్ణం

(ఐదో పేజీ తరువాయి)

మిల్లు నిర్వాహకులు రాంరెడ్డి, అనంతరెడ్డి, రామకృష్ణ, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మ, మార్కెట్ డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, రమేశ్‌గౌడ్, జంగయ్య, యాదయ్య, శ్యామ్‌సుందర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సత్యం పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

రోడ్డును విస్తరించాలి

ఆమనగల్లు మున్సిపాలిటీ జంగారెడ్డిపల్లి నుంచి మాడ్గుల మండలం చంద్రాయన్‌పల్లి వరకు పాడైన రోడ్డును వెంటనే మరమ్మతు చేయించాలని పోలెపల్లి, చంద్రాయన్‌పల్లి, చెన్నంపల్లి, సింగంపల్లి గ్రామాల నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డిని కోరారు. గురువారం పోలెపల్లికి వచ్చిన ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఆమనగల్లు పీఏసీఎస్ వైస్‌చైర్మన్ సత్యం, చంద్రాయన్‌పల్లి మాజీసర్పంచ్ యాదిరెడ్డి, తదితరులున్నారు.

వాగు వద్ద బ్రిడ్జి నిర్మించాలి

మాడ్గుల : సాగర్ రోడ్డు నుంచి రౌడమ్‌పల్లి మీదుగా బీటీ రోడ్డుతో పాటు వాగు వద్ద బ్రిడ్జి నిర్మించాలని, హనుమాన్ ఆలయానికి సంబంధించి 33 ఎకరాల భూ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆర్కపల్లికి చెందిన గ్రామస్థులు వినతిపత్రం అందచేశారు. దాంతో ఆయన ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డికి ఫోన్‌చేసి సమస్యను పరిష్కరించాలని తెలిపారు. బీజేపీ నాయకులు దండు రాకేశ్,అంతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సిరిసవాడ శ్రీనులు తదితరులున్నారు.

వివాహ వేడుకలో కసిరెడ్డి

కడ్తాల్ : కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు, గిరిజన సేవాసంఘం రాష్ట్రనేత జటావత్ జవహర్‌లాల్-ప్రేమ దంపతుల కుమారుడు సుమన్ వివాహవేడుక గురువారం మైసిగండి ఎమ్మార్జీ గార్డెన్‌లో జరిగింది. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, రాష్ట్ర ఫుడ్‌కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌బీసీ మాజీసభ్యుడు తల్లోజు ఆచారి, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

ఆలయ నిర్మాణ పనులకు మోక్షం



కొనసాగుతున్న బీరప్ప దేవాలయ నిర్మాణ పనులు

మంచాల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మంచాలలోని శ్రీ కామరాతి బీరప్ప దేవాలయ నిర్మాణ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. స్థానిక కురుమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన బీరప్ప దేవాలయానికి సంబంధించి కొన్ని సంవత్సరాలుగా భూవివాదం నడుస్తోంది. దాంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చొరవతో కురుమ సంఘం ప్రతినిధులు, భూమి యజమానులతో సమన్వయం కుదిర్చి సమస్య పరిష్కరించారు. ఈమేరకు గురువారం బీరప్ప దేవాలయ నిర్మాణ పనులు పునఃప్రారంభించారు. మాజీ ఎంపీటీసీ ఎదమ నరేందర్‌రెడ్డి కురుమ సంఘం ప్రతినిధులతో కలిసి పనులను పరిశీలించారు. అంతా కలిసిమెలిసి ఉండాలంటూ స్థానికులకు సూచించారు.



విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

షాద్‌నగర్ రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. పాలమూరు ట్రస్ట్ అధినేత విష్ణువర్ధన్‌రెడ్డి సహకారంతో బీజేపీ నాయకుడు శ్యాంసుందర్‌రెడ్డి విద్యార్థులకు అందించారు. హెచ్‌ఎం రవి, నాయకులు నారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కృష్ణయ్య, ముకుందరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, లోకేష్ తదితరులు ఉన్నారు.

42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే..

షాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు ఇవ్వాల్సిందేనని, అప్పటి వరకు పోరాటం కొనసాగిస్తామని బీసీ సంఘం సాధన సమితి కన్వీనర్ తమ్మలి రవీందర్, రాపోల్ నర్సింలు తెలిపారు. రిజర్వేషన్లు కల్పించాలని షాబాద్ మండలంలో చేపట్టిన దీక్షలు గురువారం 33వ రోజుకు చేరుకున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

'ఉప ఎన్నికలో కాంగ్రెస్‌దే విజయం'

కడ్తాల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘనవిజయం సాధిస్తుందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కడ్తాల మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నిక ఏదైనా కాంగ్రెస్‌దే విజయమన్నారు. నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. ఓటమిని ముందుగానే గ్రహించిన బీఆర్ఎస్, బీజేపీలు అసూయతో విమర్శలకు ఒడిగట్టాయని శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పనిచేసినట్లు తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, తదితరులు ఉన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ దివ్యాసింగ్

కేశంపేట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, ఎవరైనా పెళ్లిల్లు చేస్తే కఠిన శిక్ష అనుభవించాల్సి వస్తుందని కేశంపేట సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దివ్యాసింగ్ హెచ్చరించారు. మండల పరిధిలోని దత్తాయపల్లి ప్రభుత్వ పాఠశాలలో గురువారం బేటీ పడావో.. బేటీ బచావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాసింగ్ మాట్లాడుతూ చిన్నవయస్సులోనే బాలబాలికలకు పెళ్లిల్లు చేయవద్దని సూచించారు. ఎవరైనా అలాచేస్తే డయల్-1098కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆడపిల్లకు మంచి విద్యనందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పాఠశాలలు నెలకొల్పాయని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణ, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌తో ఉజ్వల భవిష్యత్తు

షాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు, ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా కెరీర్ గైడెన్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం షాబాద్ మండలంలో తాళ్లపల్లి, హైతబాద్, షాబాద్, సర్దార్‌నగర్, తదితర ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10వ తరగతి విద్యార్థులకు, కెరీర్ గైడెన్స్, మోడల్ స్కూల్‌లోని 6,7,8వ తరగతి విద్యార్థులకు వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సభ్యులు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న కెరీర్ కౌన్సెలింగ్ సెషన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు కవిత, లక్ష్మణ్, బాల్‌రాజు, వసంత తదితరులు ఫౌండేషన్ నిర్వాహకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మోడల్ స్కూల్లో అవగాహన కల్పిస్తున్న సభ్యులు

ఆత్మస్థైర్యం విజయానికి సోపానం

తలకొండపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆత్మస్థైర్యం, పట్టుదల విజయానికి సోపానమని బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వెల్జాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కడ్తాల జోనల్ స్థాయి ఖోఖో టోర్నమెంట్ నిర్వహించారు. ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి శ్రీనివాస్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై జోనల్ స్థాయిలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిభ ఆధారంగానే ఏ రంగంలోనైనా గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ముజుబుర్‌రహెమాన్, ప్రధానోపాధ్యాయులు నసీమ్ సుల్తానా, నాయకులు అంబాజీ, అజీజ్, నర్సింహ, విజయ్‌కుమార్, శేఖర్ రెడ్డి, విష్ణువర్ధన్, పీడీలు పరమేశ్, పాండు, శ్రీదేవి, పూర్ణిమ, నాగజ్యోతి, వివిధ మండలాల పీఈటీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు, నాయకులు

కొత్తపేట మీదుగా షాద్‌నగర్‌కు బస్సు నడపండి



డీఎం లక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచ్ జగదీశ్వర్

కేశంపేట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం డిపో నుంచి కేశంపేట మండలం కొత్తపేట మీదుగా షాద్‌నగర్ వరకు బస్సు నడపాలని కొత్తపేట మాజీ సర్పంచ్ పట్లూరి జగదీశ్వర్ గురువారం మహేశ్వరం డిపో మేనేజర్ లక్ష్మికి వినతిపత్రం అందించారు. కొత్తపేట, అల్వాల, ఎక్లాస్‌ఖాన్‌పేట, సంగెం గ్రామాల ప్రజలు షాద్‌నగర్ వెళ్లడానికి ఆర్టీసీ బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. మహేశ్వరం డిపో నుంచి మండలానికి అనేక రూట్లలో బస్సులు నడుస్తున్నాయని, ప్రజల సౌకర్యార్థం షాద్‌నగర్ రూట్లో బస్సులు నడపాలని కోరారు. ఇందుకు మేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు జగదీశ్వర్ పేర్కొన్నారు. ఆయనతో రంగు శంకర్, కడ్తాల శ్రీధర్ తదితరులు ఉన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

యాచారం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సీఐ ఎ.నందీశ్వర్‌రెడ్డి వాహనాదారులకు సూచించారు. గురువారం సాయంత్రం మండల కేంద్రంలో వాహనాలు తనిఖీ చేయడంతో పాటు డ్రంక్ అండ్‌డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించిన ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని ఆటో, క్రూయిజర్ల డ్రైవర్లను ఆదేశించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్సైలు మధు, సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.